క్లుప్తంగా

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కందనూలు:పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శోభారాణి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని నాగర్‌కర్నూల్ సెక్టార్‌లోని ఐదవ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించి బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ఆకుకూరల్లో ఐరన్, విటమిన్, మినరల్స్ ఎక్కువ శాతం ఉంటాయని ఇవి జీర్ణ వ్యవస్థకు చాలా తోడ్పాటు అందిస్తాయని తెలిపారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు జయమ్మ, అంజనమ్మ, వెంకటమ్మ, కౌసల్య, శశికళ, సుగుణ, ఉమా, పద్మజ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు గాయాలు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గేట్ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాన్‌గట్టుతండా మాజీ సర్పంచ్ పత్యనాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆమనగల్లు నుంచి గాన్‌గట్టుతండాకు ద్విచక్ర వాహనంపై మాజీ సర్పంచ్ పత్యనాయక్ వెళ్తుండగా మార్గ మధ్యలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది ఈ ప్రమాదంలో మాజీ సర్పంచ్ గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో వెల్దండలోని యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు.

సీపీఆర్‌పై అవగాహన

బిజినేపల్లి: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక అన్నారు. గురువారం పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాలెం పీహెచ్‌సీ వైద్య బృందం విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. వైద్యాధికారి ప్రియాంక, ప్రిన్సిపాల్ డా. రాములు, వైస్ ప్రిన్సిపాల్ సుష్మ, పోగ్రా కన్వీనర్ డా.నాగరాజు, సిబ్బంది శ్రీనివాసులు, కూన గోవర్ధన్, గజవర్ధనమ్మ, జయమ్మ, పార్వతి, విజయలీల పాల్గొన్నారు.

పాఠశాల స్థలాన్ని రక్షించాలి

బిజినేపల్లి: మండలంలోని పాలెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఏం.తారాసింగ్ అన్నారు. మంగళవారం సాక్షిలో ప్రచురితమైన బడి జాగాకే ఎసరు అనే కథనానికి ఆయన స్పందిస్తూ గురువారం పాలెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను విద్యార్థులతో కలిసి సందర్శించారు. కబ్జాదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, నాయకులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

లింగాల: మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. మండలంలోని కొత్తచెర్వుతండా, అంబట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఈఓతో పాటు కాంప్లెక్స్ హెచ్ఎం నిరంజన్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎఫ్ఏ–2 పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని, విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం సిద్ధం

కల్వకుర్తి: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయకుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆలోచన మేరకే రిజర్వేషన్లు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రిజర్వేషన్ల కోసం జీవో ప్రభుత్వం జారీ చేసిందన్నారు. శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టిందని గుర్తి చేశారు. రిజర్వేషన్లు అమలు కాకుండ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.అడ్డంకులను అధికమించి బీసీలకు న్యాయం చేస్తామని తెలిపారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని రైతు వ్యవసాయ ఉత్పత్తిదారుల ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ద్వారా రత్నగిరి ఫౌండేషన్ అధ్వర్యంలో గురువారం మండలంలోని రైతులకు ఉచితంగా సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ డైరెక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫౌండేషన్ కన్వీనర్ దర్మతేజ, ఏట చిన్న హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గోల్డ్ మెడల్

అచ్చంపేట రూరల్/కొల్లాపూర్ రూరల్: అచ్చంపేట పట్టణానికి చెందిన కపిలవాయి శ్వేత పాలమూరు యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌కు ఎంపికైంది. 2023 సంవత్సరానికి గానూ ఎంఈడీలో 82.25శాతం మార్కులు సాధించిన శ్వేత గురువారం మహబూబ్‌నగర్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. అదేవిధంగా కొల్లాపూర్ పట్టణంలోని పీజీ సెంటర్ తెలుగు విభాగానికి చెందిన రేణుక, సోషల్ వర్క్ విభాగానికి చెందిన భవానీలు గోల్డ్‌మెడల్ సాధించారు.



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న శ్వేత

మహిళా సంఘాలకు ప్రోత్సాహం

- సబ్సిడీపై ఎకరానికి 90 కేజీల వేరుశనగా విత్తనాలు
- మండలంలో 1500 ఎకరాలలో పంట సాగు



వెల్దండలో విత్తనాలను పంపిణీ చేస్తున్న ఐకేపీ, వ్యవసాయ అధికారులు

వెల్దండ: మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయి. వారి సాధికారత కోసం ప్రత్యేక పథకాలకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా సబ్సిడీ పథకాలు అందించి తోడ్పాటు అందిస్తున్నారు. ఎన్ఎంఈఓ(నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ సీడ్స్) పథకం ద్వారా మహిళలకు వేరుశనగా విత్తనాలను అందిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల మహిళ సంఘాల సభ్యులకు 1500 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసేందుకు విత్తనాలను అందిస్తున్నారు. ప్రతి మహిళకు ఎకరానికి సరిపడా 90 కేజీల విత్తనాలను పూర్తి సబ్సిడీ అందిస్తున్నారు. మహిళ సభ్యులకు పథకం ద్వారా నాణ్యమైన విత్తనాలను సరఫరా చేస్తున్నారు. వేరుశనగాలో కదిరి–1812, జీజేఆర్–32 రకమైన మేలైన విత్తనాలను అందజేస్తున్నారు. మండలంలోని 39 గ్రామాల్లోని చిన్న సంఘాల సభ్యులకు పూర్తి సబ్సిడీలో విత్తనాలను ఐకేపీ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్నారు.

లాభాలు కూడా మహిళ సంఘాలకే..

మహిళ సంఘాల సభ్యులు సాగుచేసిన వేరుశనగ పంటలను మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు చేయనున్నారు. వాటి ద్వారా వచ్చిన లాభాలను మహిళ సంఘాలకు అందజేయనున్నారు. కంపెనీ వారు వేరుశనగా నూనెను తీసి మహిళలకు విక్రయించే విధంగా చూస్తామని కంపెనీ వారు హామీ ఇచ్చినట్లు ఐకేపీ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 780 మంది మహిళకు దాదాపుగా 1350 క్వింటాల విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.



సబ్సిడీ విత్తనాలు తీసుకెళ్తున్న మహిళా రైతులు

సంతోషంగా ఉంది



ప్రభుత్వం వారు పూర్తి సబ్సిడీలో వేరుశనగ విత్తనాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. పంట సాగు చేయడంతో దిగుబడిని ఐకేపీ వారు కొనుగోలు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. మహిళ సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. 90 కేజీల విత్తనాలు అందించారు. ఎకర పొలంలో వేరుశనగా పంట సాగుచేస్తాను.

–పద్మమ్మ, మహిళ సభ్యురాలు, భర్కత్‌పల్లి

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళ సంఘాల సభ్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పూర్తి సబ్సిడీలో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. మండలానికి 1500 ఎకరాలకు విత్తనాలను అందించడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రతి మహిళకు ఒక ఎకరానికి సరిపడ 90కేజీల వేరుశనగ విత్తనాలను అందిస్తున్నాం. పంట దిగుబడి వచ్చిన తర్వాత ఐకేపీ ద్వారానే రైతుల నుంచి కొనుగోలు చేస్తాం. ఇప్పటి వరకు 780 మంది రైతులకు దాదాపుగా 1350 క్వింటాల విత్తనాలను పంపిణీ చేశాం.

–శ్రీదేవి, ఎంపీఎం, వెల్దండ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

తెలకపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందుతాయని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక సందర్శించారు. సమయంలో డాక్టర్ విధుల్లో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. మందులు అందుబాటులో ఉన్నాయా లేవా అని సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపైన ప్రజలకు నమ్మకం పెరిగేలా పని చేయాలని మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. 126 మంది విద్యార్థులకు 91 మంది విద్యార్థులు హాజరు కావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అదేవిధంగా గౌరెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి రవికుమార్ తహసీల్దార్ జాకీర్ అలీ, ప్రధానోపాధ్యాయుడు శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోగ్ బండార్

కల్వకుర్తి రూరల్: మండలంలోని రామ్ దండియా దేవాలయ ప్రాంగణంలో గురువారం హథీరాం మహారాజ్ మఠం ఆధ్వర్యంలో బోగ్ బండార్ నిర్వహించారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గిరిజనులు చేపట్టనున్న చలో తిరుపతి కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మాజీ జెడ్పీటీసీ దశరథ నాయక్, బిక్ష నాయక్, నరేందర్ నాయక్, శివాజీ, రచ్చ శ్రీరాములు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ ఎకో బజార్

కందనూలు: జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఎకో బజార్ కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ ఆధ్వర్యంలో, నేషనల్ గ్రీన్ కార్ప్స్ రాష్ట్ర శాఖ, కళాశాల ఎకో క్లబ్ సమన్వయంతో కార్యక్రమం ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. పర్యావరణ స్నేహపూర్వక ఉత్పత్తుల ప్రదర్శన ప్రధాన లక్ష్యమన్నారు. అంతకుముందు ఏకో బజార్ బ్యానర్‌ను విడుదల చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన విషయంలో హైకోర్టు స్టే కు నిరసనగా రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపుమేరకు ఈ నెల 18న నిర్వహించే రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలని బీసీ సంఘాలు, వివిధ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బంద్ పోస్టర్ విడుదల చేశారు. జేఏసీ కన్వీనర్ సదానందం గౌడ్, రాజేందర్, జంగయ్య, ఆనంద్, పరశురాములు, వీరస్వామి, శేఖర్, శ్రీనివాసులు, ఎల్లయ్య గౌడ్ పాల్గొన్నారు.

విద్యా, ఉద్యోగాల్లోనూ..

కందనూలు: బీసీ రిజర్వేషన్ల అమలు కోసం శనివారం చేపట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని నేషనల్ బీసీ వెల్ఫేర్ జనరల్ సెక్రటరీ లక్ష్మణ్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాల్‌లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు కేవలం స్థానిక సంస్థలకే కాకుండా విద్యా, ఉద్యోగ అవకాశాల్లో కల్పించాలన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకుడు నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్ పోస్టర్ ఆవిష్కరణ

అచ్చంపేట: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన నిర్వహించే రాష్ట్ర బంద్ సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ విడుదల చేశారు. బీసీలకు అండగా ఉంటానన్నారు. విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు, రవాణా వ్యవస్థలు బంద్ సహకరించాలని కోరారు. బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు రాజు, చైర్మన్ మండిగారి బాలాజీ, కోశాధికారి అనిల్, ఆంజనేయులు, రమేష్, యాదగిరి, రంగినేని పాల్గొన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలని ధర్నా



కొల్లాపూర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ మాట్లాడుతూ తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. లేని పక్షంలో బీసీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ నెల 18న నిర్వహించే రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో మండల, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ బన్సీలాల్

పెద్దకొత్తపల్లి: ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ పరిపాలన అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామాల నుంచి వచ్చే దరఖాస్తులను పూర్తిగా విచారించి ధ్రువపత్రాలను జారీ చేయాలన్నారు. దరఖాస్తు ఫారమ్‌తో పాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బోనాఫైడ్ సర్టిఫికెట్స్ జిరాక్స్‌లను అందజేస్తే గ్రామ పరిపాలనా అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు విచారించి ధ్రువపత్రాలను అందించాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు దరఖాస్తు చేసుకునే సమయంలో లబ్దిదారులు కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. భూభారతి, సాదాబైనామా దరఖాస్తులను పూర్తి స్థాయిలో విచారించి కంప్యూటర్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ రమేష్‌నాయక్, ఆర్ఐ శివకృష్ణ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంపొందించాలి

కందనూలు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించాలని డీఈఓ రమేష్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీ, సుబ్రహ్మణ్య దేవస్థానం, తూడుకుర్తి ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని శారద మెమోరియల్ ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న బోధనా ప్రమాణాలను పరిశీలించారు. ఎంఈఓ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.



రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయ లోపం

లింగాల: మండలంలోని రాయవరం శివారులో ఉన్న సర్వే నెంబర్ 83 భూమికి సంబంధించి రెవెన్యూ, అటవీ శాఖల సంయుక్త సర్వే మరోసారి వాయిదా పడింది. కొన్నేళ్ల నుంచి కొనసాగుతున్న ఈ వివాదం నేటికి ఒక కొలిక్కి రాక పోవడంతో భూములు సాగు చేస్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ పాండునాయక్ ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ శాఖకు సంబంధించిన ఎమ్మార్ఐ వెంకటేశ్వర్లు, సర్వేయర్ రాంబాబు గ్రామానికి చేరుకున్నారు. దాదాపు 3 గంటల పాటు అటవీ శాఖ అధికారుల రాక కోసం ఎదురు చూసిన వారు తిరిగి వెనుదిరిగారు. గత కొన్నేళ్ల నుంచి కొనసాగుతున్న సర్వే నెంబర్ 83లో 3 వేల పైచిలుకు ఎకరాల భూమి వివాదంగా మారింది. ఇందులో 1,390 ఎకరాల 10 గుంటల రెవెన్యూ భూమిలో గత 70 ఏళ్ల నుంచి భూమి లేని పేదలు సాగు చేస్తున్నారు. ఈ భూమి అటవీ శాఖ పరిధిలో ఉందని అటవీ శాఖ వారు వాదిస్తుండగా కాదు రెవెన్యూ పరిధిలో ఉందని రెవెన్యూ శాఖ వారు అంటూ ఎటు తేల్చలేక కాలయాపన చేస్తూ వస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ భూ వివాదాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెవెళ్లారు. వివాదానికి పరిష్కార మార్గం చూపాలని సీఎం ఆదేశించినప్పటికి రైతులకు న్యాయం జరుగడం లేదని చెప్పవచ్చు. ఏళ్ల తరబడి సాగులో ఉన్న రైతులకు ఇప్పటి వరకు భూములపై రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి హక్కు పత్రాలు అందకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను త్వరగా పరిష్కరించి మేలు చేయాలని రైతులు ఆయా శాఖల అధికారులను కోరుతున్నారు. ఈ విషయంలో తహసీల్దార్‌ను వివరణ కోరగా సంయుక్త సర్వేకు రావాలని అటవీ శాఖ వారికి తెలపామని కాని వారు రాలేదని తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు. అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాషా వివరణ ఇస్తూ భూములు సాగులో ఉండడం, వాగు దాటనివ్వడం లేదని అక్కడి రైతులే తెలిపారని ఇలాంటి పరిస్థితులో సర్వే చేయడం సాధ్యం కాదని వెళ్ల లేదని వివరించారు.

హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తాం



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ జనార్దన్‌రెడ్డి, అధికారులు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆశ్రమ పాఠశాలను డీటీడబ్ల్యూఓ ఫిరంగితో కలిసి ఆయన పరిశీలించారు. బుధవారం రోజున విద్యార్థినులు హాస్టల్‌లో సమస్యలపై నిరసన చేపట్టడంతో అధికారులు హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో హాస్టల్ రూంలలో లైట్లు, ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, బాత్రూంలను శుభ్రం చేయించటంతో పాటుగా, పరిసరాలను శుభ్రం చేయించాలని అధికారులకు విద్యార్థినులు తెలిపారు. వెంటనే స్పందించిన ఆర్డీఓ లైట్లు, ఫ్యాన్లను తెప్పించి బిగించారు. రెండు రోజులలో అన్ని సమస్యలు తీరేలా కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చామని, సమస్యలు పరిష్కరించకుంటే నాకు ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు ఆర్డీఓ సూచించారు. విద్యార్థినులకు వడ్డించే ఆహారాన్ని పరిశీలించి, వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం హాస్టల్ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యార్థినులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని, ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే తన దృష్టికి తీసుకొనిరావాలని వారికి సూచించారు. ఆయన వెంట కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, ఏటీడబ్ల్యూఓ యాదమ్మ, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగాల: మండలంలోని లింగాల, అంబట్‌పల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలో పరికరాల మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆడపిల్లలపై వివక్ష చూపొద్దు



నాగర్‌కర్నూల్ క్రైం: ఆడపిల్లలపై వివక్ష చూపొద్దని, అన్ని రంగాల్లో వారికి సమాన అవకాశాలు కల్పించాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ మధుసూదన్ రావు అన్నారు. గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు బాగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పోక్సో చట్టంతో పలు చట్టాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ వెల్ఫేర్ అధికారి సుదర్శన్, ఇన్‌చార్జ్ హెచ్ఎం మంజుల ఉన్నారు.

అథ్లెటిక్స్ సాంకేతిక అధికారిగా ఎడ్మ శ్రీను

మన్ననూర్: నల్లమలకు చెందిన ఎడ్మ శ్రీను ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ సాంకేతిక అధికారిగా ఎంపిక కావడంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వరంగల్ జిల్లా కేంద్రంలోని జవాహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే ఇండియన్ ఓపెన్ అండర్ 23 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌కు ఎడ్మ శ్రీను సాంకేతిక అధికారిగా వ్యవహరించనున్నారు. కొంత కాలంగా అథ్లెటిక్స్‌లో ఆయన చేస్తున్న కృషి ఫలితంగా ఈ అవకాశం దక్కిందన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, టెక్నికల్ కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన

మన్ననూర్: స్థానిక గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మదర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై గురువారం ప్రొజెక్టర్ సహాయంతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుధాకర్, సొసైటీ సభ్యురాలు సరస్వతి, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీధర్, పీఈటీ మల్లయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



తాడూరు: మండలంలోని తుమ్మలసూగురులో గురువారం నిర్వహించిన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశువైద్య ప్రత్యేకాధికారి జ్ఞానశేఖర్ ఆకస్మికంగా పరిశీలించారు. వైద్యాధికారి డా.ప్రవీణ్‌కుమార్, సిబ్బంది రమేష్, భాస్కర్, మల్లేష్, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల: మండలంలోని కొత్తకుంటపల్లిలో పశువైద్యాధికారిణి ప్రియాంక పశువులకు టీకాలు వేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



కోడేరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు అన్నంలో పురుగులు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోడేరు: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన మండలంలోని నర్సాయిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి నుంచి కొల్లాపూర్‌కు మెకానిక్ వెంకటేష్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యలో బొలెరో వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాల కార్మికులకు విముక్తి

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్ గ్రామ వ్యవసాయ పొలంలో పనిచేస్తున్న 15 మంది బాల కార్మికులకు గురువారం అధికారులు విముక్తి కల్పించారు. జిల్లా ఏహెచ్‌టీయూ సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా ఏదుట్ల గ్రామానికి చెందిన 10 మంది విద్యార్థులు, మంగనూర్ గ్రామానికి చెందిన 5 మంది విద్యార్థులను మంగనూర్‌లో పత్తి చేను పనికి వెళ్లారు. వ్యవసాయ పనులు చేస్తుండగా వారిని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విద్య ప్రాముఖ్యతను విద్యార్థుల తల్లితండ్రులకు వివరించారు. 18 సంవత్సరాలోపు చిన్నారులు ప్రత్యేక వాహనాల్లో వ్యవసాయ పనులకు తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పండ్ల మొక్కలు పెంచాలి



బిజినేపల్లి: రహదారులకు ఇరువైపులా అధిక మొత్తంలో ఆక్సిజన్, పండ్ల మొక్కలను నాటాలని ఎంపీడీఓ కథలప్ప సూచించారు. గురువారం లట్టుపల్లి గ్రామంలోని చిన్నపీరుతండా శివారులో అవెన్యూ ప్లాంటేషన్ కింద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో గిరిజన తండాల అభివృద్ధిల భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు చిన్నయ్య, అశోక్, మండల గిరిజన నాయకులు గోవిందు నాయక్, శ్రీను, రాజగోపాల్, పాండు, దీపక్ చంద్రు, సాలెమ్మ, మునీందర్ శాంతి, బాలు, మని, జెమిని తండావాసులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి

వెల్దండ: సీజనల్ వ్యాధులపై దృష్టి సారించినట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ భీమానాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పోషమ్మగడ్డతండాలో వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు మొబైల్ ఎక్స్‌రే ద్వారా టీబీ వ్యాధి నిర్ధారణ, తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సింధు, పవన్ కళ్యాణ్, సిబ్బంది శ్రీనివాస్, స్వప్న, మురళీ కృష్ణ, మనోజ్ కుమార్, గౌరీకుమార్, మధుసూదన్‌రెడ్డి, తిరుతమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి

పెద్దకొత్తపల్లి: ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వరి ధాన్యం కొనుగోలుపై మహిళ సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని సరిపడా తేమ ఉన్నప్పుడు వెంటనే కొనుగోలు చేసి, కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రశీదులు అందించాలన్నారు. రైతులు దళారులకు అమ్ముకొని మోస పోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొను గోలు కేంద్రాల్లోనే విక్రయించేలా గ్రామాల్లో రైతు లకు అవగాహన కల్పించాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం యొక్క డాటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్ఎం మహేంద్రకుమార్, డీపీఎం కృష్ణయ్య, ఏపీఎం సంతోష్, మేనేజర్ శివన్ పాల్గొన్నారు.